గాలి వానకు ఇంటి వద్ద పడిపోయిన చెట్టు

'పురం'లో గాలివాన బీభత్సం

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సష్టించింది. వర్షంతో పాటు గాలి వేగంగా వీచడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీనికన్నా ముందు సేవ మందిరంలోని 220 కెవి సబ్ స్టేషన్‌లో గాలి, వర్షం వల్ల ఫీడర్ ట్రిప్ అయ్యింది. దీంతో పట్టణంలో విద్యుత్ స్తంభాలు పడి వైర్లు తెగి ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. సరఫరా ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. వీలైనంత త్వరలో మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి తెలిపారు.

గాలి వానకు ఇంటి వద్ద పడిపోయిన చెట్టు

ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

జెడ్పీలో జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

'ఆర్డీటీని కాపాడుకుందాం'..!

◆ అందరి నోటా అదేమాట
◆ ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాల్సిందే..
◆ అఖిల పక్ష, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆర్డీటీని కాపాడుకుందాం అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అందరి నోటా ఒకే మాట విన్పిస్తోంది. ఆర్డీటీని కాపాడండి అంటూ అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాలూ కోరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎని పునరుద్ధరించాలని అడుగుతున్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు రాకుండా నిలిపేయడంపై 'ఆర్డీటీకి బిజెపి బ్రేక్' అని ఈ నెల 15వ తేదీన ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వచ్చింది. ఈ కథనం వెలువడగానే దీనిపై ప్రజా ఉద్యమం ఆరంభమైంది. గత కొన్ని రోజులుగా అందరూ ఆర్డీటీ సేవలను గుర్తించి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం నాడు జిల్లా పరిషత్ కార్యాలయం హాలులో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో సిపిఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల సమావేశం జరిగింది. మరోవైపు ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో సిసిసి ఛైర్మన్ షకీల్ షఫి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం నాడు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అన్నింటిలోనూ అన్ని రాజకీయా పార్టీలు, ప్రజా సంఘాలు 'సేవ్ ఆర్డీటీ' అంటూ నినదించాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వికె.మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ వికె.రంగారెడ్డి, మాజీ మేయర్ స్వరూప, టౌన్ బ్యాంకు అధ్యక్షులు జెఎల్.మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు ఆర్డీటీ సేవలు, అది లేకపోతే కలిగే నష్టాలను తెలియజేశారు.

ఆర్‌డిటి సేవలకు బిజెపి బ్రేక్..!

- ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ పునరుద్ధరణ నిలిపివేత
- ఆగిపోనున్న సేవలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు కల్పతరువుగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) సేవలకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకట్టవేసింది. ఆ సంస్థకు సంబంధించి నిధుల వినియోగానికి అవసరమైన ఎఫ్‌సిఆర్‌ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు) కింద అనుమతుల పునరుద్ధరణను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ఫలితంగా ఇప్పటి వరకు ఆర్‌డిటి సంస్థ ద్వారా అందుతున్న సేవలకు బ్రేక్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా విదేశీ నిధులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలపై బిజెపి ప్రభుత్వం కత్తికట్టిందన్న ఆరోపణలున్నాయి. ఇది వరకే ఆర్‌డిటికి విరాళాలు అందిస్తున్న విదేశీ సంస్థలపై నిషేధం విధించింది. దీనివల్ల ఏటా ఆర్‌డిటికి విరాళంగా వస్తున్న నిధుల్లో కోతపడింది. తాజాగా ఇప్పుడు లైసెన్సు పునరుద్ధరణ ఆపివేయడంతో నిధుల వినియోగంపైనా ప్రభావం పడనుంది.

ఏటా రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ .?

1969లో అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి ప్రారంభమైంది. అప్పటి నుంచి సేవలను విస్తరిస్తూ అనంతపురం జిల్లాలో ఒక భాగమైంది. క్రమంగా విస్తరిస్తూ రాష్ట్రంలో కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో భూపాల్‌పల్లి, నాగర్‌కర్నూలు, నల్గొండ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. ఏడాదికి సగటున రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ ఉంటుంది. గతేడాది నుంచి ఈ సంస్థకు వచ్చే విరాళాలపై కేంద్రం నిషేధం విధించడంతో చాలా వరకు సేవలను ఈ సంస్థ తగ్గించుకుంటూ వస్తోంది. ఇక రెన్యువల్ జరగకపోతే పూర్తి స్థాయిలో సేవలు ఆగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆర్‌డిటి ద్వారా అందుతున్న సేవలు

అనంతపురం జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా బలహీన వర్గాలు, దళిత, గిరిజనులకు ఆర్‌డిటి కట్టించిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు లక్ష వరకు ఇంటి నిర్మాణాలను చేశారు. అవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం పెద్దఎత్తున కృషి చేశారు. స్పోర్ట్సు కాంప్లెక్సు ద్వారా గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దే కార్యక్రమాలు ముమ్మరంగా నడుస్తూ వస్తున్నాయి. వైద్యపరంగాలోనూ విశిష్టమైన సేవలను అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్ ప్రాంతాల్లో మూడు ఆసుపత్రులున్నాయి. 532 పడకలతో ఈ ఆస్పత్రుల ద్వారా సేవలను అందిస్తున్నారు. ఇవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లు, మొబైల్ క్లినిక్‌లు నడుస్తున్నాయి. ఇంత పెద్దఎత్తున సేవలందిస్తున్న ఈ సంస్థపై బిజెపి ప్రభుత్వం వేటు వేసేందుకు సిద్ధపడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు ఆపడంపై 'ఆర్డీటీ సేవలకు బిజెపి బ్రేక్' పేరుతో ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనం

ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణకు ప్రయత్నిస్తాం
అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం ఎంపి

ఆర్డీటీ సంస్థ విద్య, వైద్య రంగాలతో పాటు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను పోషిస్తోంది. 1969 నుంచి ఆ సంస్థ ప్రజల్లో ఒక్కటై పనిచేస్తోంది. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణ నిలిపివేయడంతో జిల్లావాసులకు నష్టం జరుగుతుంది. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వరకు తీసుకెళ్లి సేవలు యథావిధిగా కొనసాగించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తాం.

కేంద్రంతో మాట్లాడుతాం
బికె.పార్థసారథి, హిందూపురం ఎంపి.

ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణకు తమ వంతు ప్రయత్నం చేస్తాం. ఆ సంస్థ దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ప్రజలతో కలసి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. గృహ నిర్మాణాలు మొదలుకుని, మహిళల సమస్యలు అన్నింటిలోనూ పనిచేస్తోంది. అలాంటి సంస్థకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఆ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరణ చేసేలీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం.

ఆర్డీటీ భాగస్వామ్యాన్ని గుర్తించండి
వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే.

ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో ఆర్డీటీ భాగస్వామ్యం ఎనలేనిది. దీన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ సంస్థ అనేక సంవత్సరాలుగా ఈ జిల్లా అభివృద్ధిలో ఎంత కీలకంగా పనిచేస్తోంది. అటువంటి సంస్థకు ఆడిట్‌లో లోపాలను చూపించి నిధులు ఆపడం సరైంది కాదు. ఈ సమస్యను తాము కూడా తమ పార్టీ పార్లమెంటరీ నాయకుడైన మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి ఆర్డీటీకి తిరిగి విదేశీ నిధుల విడుదల అయ్యేలా కృషి చేస్తాం.

'సేవ్ ఆర్డీటీ' సోషియల్ మీడియాలో ప్రచారం
వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఆర్డీటీ సంస్థ సేవలు ఒక్క అనంతపురం జిల్లాలోనే కాదు. రాయలసీమ జిల్లాలతోపాటు, నెల్లూరు, ప్రకాశ జిల్లాల్లోనూ నడుస్తున్నాయి. తెలంగాణలోనూ సేవలందిస్తోంది. గుజరాత్‌లో భూకంపం వచ్చిన సమయంలోనూ అక్కడికెళ్లి సేవలందించింది. అటువంటి సంస్థపై కర్నూలులో ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో నిధులు నిలిపివేయడం సరైంది కాదు. ఈ సంస్థను కాపాడాలని మంగళవారం నాడు సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేపట్టాలని ప్రజా సంఘాల సమావేశంలో నిర్ణయించాం. మంగళవారం నాడు పెద్దఎత్తున సేవ్ ఆర్డీటీ అన్న నినాదాన్ని ప్రతి ఒక్కరూ హోరెత్తించాలి.

ఆర్డీటీని కాపాడుకుందాం
జగదీశ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు.

ఆర్డీటీ సంస్థ జిల్లాలో ఒక భాగమై ఉంది. విద్య, వైద్యమే కాకుండా మహిళా అభివృద్ధి, గృహనిర్మాణాలు అనేక రకాలుగా పనిచేస్తోంది. అటువంటి సంస్థకు సాంకేతిక కారణాలను చూపి నిధులు రాకుండా నిలుపుదల చేయడం సరైంది కాదు. ఆ సంస్థను కాపాడుకునేందుకు అందరూ కలసిరాలి.

అర్జీలకు పరిష్కారం చూపండి

కలెక్టర్ టిఎస్.చేతన్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం చూపాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 231 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయ సారథి, స్పెషల్ కలెక్టర్ సూర్యనారాయణ, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు వచ్చిన అర్జీలను హెచ్‌డిఒఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని డిఆర్‌ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌లో రెవెన్యూ, సర్వే, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల సమస్యలు అధికంగా అర్జీలు రూపంలో వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సాధ్యం కాని వాటికి రిమార్కులు రాసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

కిశోర వికాసంపై గోడపత్రికలు ఆవిష్కరణ

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కిశోర్ వికాసం గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిశోర బాలికలు 15 నుంచి 18 సంవత్సరాల అమ్మాయిలకు గ్రాఫ్ ఏర్పాటు చేసి, పోలీస్, ఎఎన్‌ఎం, అంగన్వాడీ వర్కర్ కలిసి విద్య ప్రాధాన్యత, సంపూర్ణ ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల చట్టం, ఆత్మరక్షణ సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సెర్ప్ ఆధ్వర్యంలో గుడిబండ వ్యవసాయ అనుబంధ రైతు ఉత్పత్తిదారుల స్వయం సహాయక సంఘాల ప్రకతి వ్యవసాయంతో పండించిన చిరుధాన్యాలు కాయగూరల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వ్యవసాయ అధికారి సుబ్బారావు, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హిందూపురంలో సంబరాల సందర్భంగా మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్

బాలయ్యకు పద్మభూషణ్

హిందూపురంలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రముఖ సినీ కథానాయకుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ పద్మభూషణ్ అవార్డు అందుకున్నాడు. సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా బాలకష్ణ పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. బాలకృష్ణ పురస్కారాన్ని అందుకోవడంతో సోమవారం సాయంత్రం టిడిపి శ్రేణులు, బాలయ్య అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. వర్షంలోనే హిందూపురం పట్టణంలో స్థానిక నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస రావు, పీఏ బాలాజీ తదితరులు సంబరాలు చేసుకున్నారు. సినీ పరిశ్రమలో గత ఐదు దశాబ్దాలుగా నటనలో అందిస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం బాలకష్ణను పద్మభూషణ్ అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయం అన్నారు.

'పది' మండల టాపర్‌కు సన్మానం

ప్రజాశక్తి-లేపాక్షి

పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని రక్షితను సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు సన్మానించారు. సిరివరంలోని తారక రామారావు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని రక్షిత 591 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో రక్షితను మండలం స్థాయి అధికా రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహమూర్తి, వ్యవసాయ అధికారిణి శ్రీలత, ఎంఇఒ నాగరాజునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థిని రక్షితను సన్మానిస్తున్న అధికారులు

సాగుదారులకు సర్వే స్కెచ్‌లు ఇవ్వండి

ప్రజాశక్తి-రొద్దం

సాగుదారులకు భూ సర్వే చేపట్టిన స్కెచ్‌లు ఇవ్వాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ అధ్యక్షతన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సభ్యులు నారాయణ మాట్లాడుతూ మండలంలోని కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బీదాను పల్లి, బక్సంపల్లి గ్రామాల్లోని భూమిలేని దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన 150 కుటుంబాలు కోగిర రెవెన్యూ పొలం సర్వే నంబర్-669లోని ప్రభుత్వ భూమిలో 3 నుంచి 5 ఎకరాల చొప్పున 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. వారికి అసైన్మెంట్ హక్కులు, సబ్సిడీ రుణాలు, విత్తనాలు ఇవ్వాలని ఆందోళనలు చేయడంతో రెవెన్యూ, సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీ లన చేసి కొలతలు వేసి హద్దులు నాటారన్నారు. వాటి ఆధారంగా తాత్కాలికంగా సాగు అనుభవ పత్రాలు, స్కెచ్‌లు 40 రోజుల్లో ఇస్తామ ని హామీ ఇచ్చారని, అయితే 4 నెలలైనా ఇవ్వలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సాగుదారులకు సర్వే స్కెచ్‌లు ఇవ్వాలని కోరుతూ తహశీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ 20 రోజుల్లో భూములను పరిశీలించి, అటవీ అధికారులతో మాట్లాడి రికార్డుల మేరకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. కాగా సాగుదారులు సుమారు 150 మంది రొద్దం పోస్టాఫీస్ నుంచి లేఖలను పోస్ట్ ద్వారా పంపించారు. కార్యక్రమంలో సాగుదా రులు రత్నాభాయి, సునీతాభాయి, రామాంజనమ్మ, భారతి, రాజ్‌గోపాల్, విజయ్, చిన్న అంజనప్ప, జయమ్మ, భాగ్యమ్మ, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెద్దన్న, నారాయణ, రైతులు

పట్టాదారు పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాల కోసం ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ

సాగు భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు, నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణం లోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు తక్షణమే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలన్నారు. ఈ విషయంపై మే 5వ తేదీ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. అలాగే ఇస్లాపుర గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్న భూములకు వెంటనే పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు పేదలపై వివిధ రూపాల్లో ఆర్థిక భారాలు మోపడం దుర్మార్గమ న్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు, సాగు భూములు ఇవ్వకుండా అన్యాయం చేస్తోందన్నారు. ధర్నాలో సిపిఎం నాయకులు హరి, బాబావలి, వ్యకాసం జిల్లా నాయకులు వెంకట్రాముడు, తిప్పన్న, గ్రేష్మి, ఆయిషా, అంజనప్ప, రాజు, బైలాంజి, అంజనమ్మ, పేదలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన సిపిఎం నాయకులు

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

పెనుకొండ : బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమతా స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న సమతా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాల్యవివాహాల నివారణకు శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల పరిధిలో పని చేస్తున్నామన్నారు. వివిధ మత పెద్దలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో బాల్యవివాహాలు చేపట్ట రాదని కోరామన్నారు. 700కుపైగా బాలికలను గుర్తించి 18 ఏళ్ల నిండే వరకు వివాహం చేయమని వారి కుటుంబ సభ్యుల నుంచి అంగీకార పత్రం తీసుకున్నామని వివరించారు. అనంతరం బాల్యవివాహాల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సమతా స్వచ్ఛంధ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాస్టర్ గోపాల్‌రెడ్డి, ముస్లిం మత పెద్ద బాబా ఫకృద్దీన్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివికి 'స్లాప్' చేయూత

ప్రజాశక్తి-రొద్దం

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా స్లాప్ కంపెనీ సెక్రటరీ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కెజిబివికి కంప్యూటర్లు, కుర్చీలు, బెడ్లు, మంచం, డెస్కులు, యుపిఎస్ బ్యాటరీలు, ఇతర సామగ్రిని అందజేసినట్లు ప్రిన్సిపల్ నాగరత్న తెలిపారు. ఈ సామగ్రి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతుందని ఆమె తెలిపారు. సమాజ సేవకు ముందుకొచ్చిన స్లాప్ సంస్థకు, విరాళం అందజేయడానికి సహకరించిన సురేష్‌రెడ్డికి ప్రిన్సిపల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి చొరవతో నారనాగేపల్లికి బస్సు

ప్రజాశక్తి-రొద్దం

మంత్రి సవిత ప్రత్యేక చొరవతో మండలంలోని కర్నాటక సరిహద్దులో ఉన్న నారనాగేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో దాదాపు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన రొద్దం రావాలంటే ద్విచక్ర వాహనం, ఆటోలే దిక్కయ్యేవి. అలాగే పెన్నా నది పరివాహక ప్రాంతం కావడంతో నదిలో రోడ్డు లేక అవస్థలు పడేవారు. అయితే గత ప్రభుత్వంలో పెన్నా నదిలో కాజ్‌వే ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో స్థానిక టిడిపి నాయకులు పది రోజుల క్రితం మంత్రి సవితను కలిసి బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి హిందూపురం డిపో అధికారులతో మాట్లాడడంతో హిందూపురం నుంచి రొద్దం వరకూ నడిచే బస్సును నారనాగేపల్లి వరకూ పొడిగించారు. దీంతో టిడిపి మండల నాయకులు ఉదయం గ్రామంలో బస్సు ముందు కేక్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు మాట్లాడు తూ మంత్రి సవిత ప్రత్యేక చొరవతో గ్రామానికి బస్సు ఏర్పాటు చేశారని, త్వరలో ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వీరాంజనే యులు, హరీష్, నాగభూషణ, మనోహర్, సోమశేఖర్, హనుమంతప్ప, లక్ష్మినారాయణ, నాగిరెడ్డి, డీలర్ సోమశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు వచ్చిన సందర్భంగా స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-మడకశిర

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయుఎ) ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్‌ఎంయుఎ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమ, మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్‌ఎంయుఎ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, అక్రమ సస్పెండ్లు, తొలగిం పులు ఆపాలని, ఉద్యోగోన్నతులు చేపట్టాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని, సిక్ లీవులకు పూర్తి వేతనం చెల్లించాలని, పాత వైద్య విధానం పునరుద్ధరించాలని, నైట్ అవుట్ అలవెన్సును రూ.400కు పెంచాలని, తదితర డిమాండ్లను ఏకరువు పెట్టారు. దీక్షలో ఎన్‌ఎంయుఎ డిపో కమిటీ అధ్యక్షుడు ముద్దప్ప, సహకార్యదర్శి జయసింహ, సభ్యుడు నాగరాజు కూర్చున్నారు. వీరికి మద్దతుగా అనేకమంది ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

సోమందేపల్లి : స్థానిక గ్రంథాలయంలో అధికారి కె.మెహబూబ్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఉపాధ్యాయులు శ్రీనివాసులు, స్పెషల్ టీచర్ కె.లింగ రాజు హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థులు ఇక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానవంతులుగా ఎదగాలని సూచించారు. మెహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు.

సోమందేపల్లిలో శిబిరానికి హాజరైన పిల్లలు

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో అధికారి హెచ్.నాగరాజు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకూ నిర్వహిస్తామని, ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ వేసవి శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా మండలంలోని రొప్పాల పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, పవన్ హాజరై శిక్షణ శిబిరం ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్, ఆటలు ఆడించడం, డ్రాయింగ్, తదితర వాటిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి విద్యార్థి ఈ శిక్షణలో పాల్గొనాలని గ్రంథాలయ అధికారి కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

30న మున్సిపల్ కౌన్సిల్ మీట్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఈనెల 30న అత్యవసర కౌన్సిల్ సమావేశమును నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. మొత్తం 11 అంశాలపై అజెండా తయారు చేయడం జరిగిందని, ఈ అజెండాను కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించడం జరుగుతుందని తెలిపారు. సకాలంలో కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు అందరూ హాజరు కావాలని కమిషనర్ కోరారు.

ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ధర్మాంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి నెల రోజులపాటు స్థానిక కాలేజీ గ్రౌండ్ బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ శిక్షణ శిబిరం ఉదయం, సాయంత్రం రెండు పూటలా నిర్వహించబడుతుందన్నారు. జిల్లా క్రీడా సాధికారక సంస్థ, ఆత్మీయ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9030944717, 9391710032 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

నల్లచెరువు మండలం కదిరి పూలకుంట గ్రామం దామవాళ్లపల్లిలో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు తనవంతుగా 1,65,000 రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసారు.

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ పారిశుధ్య అడిషనల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ ,కో కన్వీనర్ అయూబ్ ఖాన్, కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏం. బాబు, ముకుంద, లక్ష్మీ ఓబులేసు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో కార్మికుల సంఖ్య తక్కువ ఉండడంతో కరోనా సమయంలో పట్టణ పరిశుభ్రత కోసం, ప్రజల ఆరోగ్యాల కోసం అదనంగా కార్మికులను తీసుకున్నారన్నారు. వారికి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవులు అడిషనల్ కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 60 సంవత్సరాల వయస్సు పైబడిన పది మంది అవుట్సోర్సింగ్ కార్మికులను తొలగించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కానీ, పెన్షన్ సౌకర్యం కానీ లేకుండా ఏళ్ల తరబడి పారిశుధ్య కార్మికులుగా పనిచేసిన వీరి కుటుంబాల్లోని పిల్లలకు వీరి స్థానంలో ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలకష్ణ, తిరుపాల్,జనార్ధన్ సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయం

ప్రజాశక్తి-హిందూపురం

పహల్గాం ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని హిందూపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం నుండి అధ్యక్షులు వన్నెరప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నెరప్ప, రామచంద్రప్ప, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ఇందాద్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, సుదర్శన్, నాగరాజు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సిద్ధా, శ్రీరాములు, నాగేంద్ర, కృష్ణమూర్తి, రకీబ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S No:07/2023

Between:
Y. Chandramrna and others ...**Plaintiff**
V/S

Defendant No.10:
Y. Naresh S/o Late Y Peddanna, aged about 28 years, Hindu, Cultivation, R/o Kesapuram Village, Kothacheruvu Mandal, Sri Sathya Sai District.

Defendant No 11:
Y. Bharath S/o Late Y Peddanna, aged about 26 years, Hindu, Cultivation, R/o Kesapuram Village, Kothacheruvu Mandal, Sri Sathya Sai District. ...**Defendant 10 & 11**

ప్రతివాదికి దావా సమను

పై దావాలో మీ మీద దావా దాఖలు చేసియున్నది.సదరు దావా నీ యొక్క హాజరు నిమిత్తం తేది:05-05-2025 నాటికి వాయిదా వేసియున్నారు. ఈ దినము పై కోర్టు ఎదుట ఉదయం 10:30 గంటలకు వకీలు ద్వారా గాని లేద సొంతంగా గాని హాజరై నీ యొక్క అభ్యంతరములు తెలుపుకోగలరు. లేనిచో పై దావాను మీ పరోక్షమందు తీర్మానం కాగలరు.

Date of Hearing: 05-05-2025

D.Nagaraju,
Challa Chandra Sekhar,
Advocates Puttaparthy
Cell:9490767636, 9441518908.

జగన్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

అధికారం కోల్పోగానే నియోజకవర్గ ప్రజలకు వైసీపీ శ్రేణులకు దూరమయ్యారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. కదిరి పట్టణంలోని తాయి గ్రాండ్ లో ఎన్పీకుంట మండలం టిడిపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ కదిరిలో వైసీపీకి నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు ఉన్నామని గొప్పలు చెప్పుకుంటారని సొంత శ్రేణులకు భరోసా కల్పించే నాయకుడా పార్టీకి కరువయ్యారని ఎద్దేవా చేశారు. రాజకీయలలో స్థిరమైన నాయకత్వమే ముఖ్యమని తాను ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఎదుర్కొని నిలబడ్డానని చెప్పారు. నాయకులు కార్యకర్తలు సమిష్టి కృషితో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేసామని అన్నారు. ఎన్పి కుంట మండలంలో బలమైన స్థిరమైన నాయకత్వం టిడిపికి ఉందని అందరూ సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. వైసీపీ అధినేత జగన్ పై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్మోహన్ రెడ్డి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. ముంబై నటి జత్వాని కేసులో పిఎస్ఆర్ ఆంజనేయులు పాపం పండి జైలుకు వెళ్లారని అన్నారు. బెదిరించి మళ్ళీ అధికారంలోకి వస్తానని పగటి కలలు కంటున్న వైయస్ జగన్మోహన్ రెడ్డిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. అవినీతిలో పూర్తిస్థాయిలో కురుకుపోయిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు పరిష్కారం వెంటనే చూపాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి. రత్న అధికారులకు సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు, డీఎస్పీలు విజయ్ కుమార్, ఆదినారాయణ , లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

అర్హులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలో రెండు సెంట్లు పల్లెటూర్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కాగృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నారాయణస్వామికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, ఫకృద్దీన్, హ్యూమన్ రైట్స్ నాయకుడు రఫీ, అల్లాబక్ష టైలర్ ముత్తు, పకీరప్ప, రిక్షా ముస్తఫా, రహీం, చికెన్ రఫీ, తదితరులు పాల్గొన్నారు

సిహెచ్‌ఒల డిమాండ్లను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైద్య ఆరోగ్య శాఖ లోని నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న సిహెచ్‌ఒల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదురుగా సిహెచ్‌ఒలు శాంతియుత నిరసన, ధర్నా నిర్వహించారు.కార్యాలయం ముందు భాగాన బైఠాయించి తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని నినాదాలు చేశారు. గత 2 సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, దీనికి సమబంధించి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతమైన నిరసన నిరవధిక సమ్మె ను నిర్వహిస్తున్నామని చెప్పారు. వారం రోజుల నుండి, జిల్లా కేంద్రాల వద్ద, కలెక్టర్ కార్యాలయాల వద్ద, రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించలేదని దీంతో నిరవధిక సమ్మెకు దిగుతున్నామని వారు తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఎంహెచ్‌ఒ ఫిరోజా బేగం కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎం సీప జిల్లా అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ నందీశ్వర్ రెడ్డి, చందన ,వేణుగోపాల్, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు లింగ రామ్మోహన్, ధర్మవరం తాలూకా ప్రెసిడెంట్ శంకర్, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణ చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతుల పేరుతో తరగతులను నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పట్టణ కన్వీనర్ అఫ్రిద్, కో కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేసవి సెలవుల్లో ఏలాంటి అనుమతులు లేకుండా పలు ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు ప్రచారాలు నిర్వహిస్తున్నాయన్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవులు ప్రకటించినప్పటికీ పలు విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నారని, తద్వారా అడ్మిషన్లు చేసుకోవడం వల్ల ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య తగ్గి ప్రభుత్వ విద్యా సంస్థలు మూత పడే పరిస్థితులు ఉంటాయని అన్నారు. వెంటనే ఇలాంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

4న ఎమ్మెల్యే బాలయ్యకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డు తీసుకున్న నేపథ్యంలో మే 4న హిందూపురం పట్టణంలో తెలుగుజాతి గర్వించే విధంగా సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ సన్మాన సభకు ప్రతిపక్షంలో ఉన్న వైసిపి ఇతర పార్టీ నాయకులు కలిసి రావాలని కోరారు. బాలకృష్ణకు పౌర సన్మానం నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో టిడిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వారు వెల్లడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, పార్టీ రూరల్ కన్వీనర్ అశ్వర్థ నారాయణ రెడ్డి, బేవినహళ్లి ఆనంద్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం నియోజకవర్గానికే గర్వ కారణమన్నారు. నియోజకవర్గం టిడిపి నాయకులందరూ కలిసి బాలయ్య పై ఉన్న అభిమానంతో సొంత డబ్బులతో బాలకృష్ణను ఘనంగా సన్మానించాలని నిర్ణయించామన్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి ప్రతిపక్షంలో ఉన్న వైసిపి తో పాటు ఇతర పార్టీ నాయకులు అందరూ హాజరైతే రాజకీయాలకు అతీతంగా పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పూలకుంట సర్పంచి మంజునాథ్, టిడిపి నాయకులు రాము, ఆదినారాయణ, పరిమళ, శివశంకర్, ఇందాద్, కౌన్సిలర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

బాల్యవివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అనిరెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భానుజా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రోడ్డు భవనాల అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్య వివాహాల నివారణపై ప్రచురించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. చర్చి మసీద్ దేవాలయాల మత పెద్దల సమక్షంలో బాల్య వివాహాల నివారణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ఆమె వివరించారు. బాల్య వివాహాలపై ఉన్న చట్టాలను ప్రజలకు తెలిపే విధంగా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఎల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ :బాల్య వివాహాల నివారణకు కృషి చేద్దామని సమత స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ ఆదినారాయణ రెడ్డి, సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమత స్వచ్ఛంద సంస్థ శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల నివారణ కోసం పనిచేస్తోందన్నారు. బాల్య వివాహాలను నివారించడానికి అన్ని మతాలకు చెందిన మత పెద్దలతో అవగాహన ప్రచారాలను నిర్వహించడం జరిగిందన్నారు. అక్షయ తృతీయ, వివాహ సీజన్ దష్ట్యా బాల్య వివాహాలు నివారించడానికి కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు, కమ్యూనిటీ మొబిలైజర్ బాబ్జాన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను కొనసాగించాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఆర్‌డిటి సేవలు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఆర్డీవోకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జేవి.రమణ, కో కన్వీనర్లు టి.అయుబ్ ఖాన్ ఎల్.ఆదినారాయణ మాట్లాడుతూ. ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాగవేణి, ఐ.లక్ష్మీదేవి, వరలక్ష్మి, సన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : పేదలకు నిరాశ్రయులకు రోగులకు ప్రతిభా విద్యార్థులకు అండగా ఉన్న ఆర్డీటీని రక్షించుకుందామని సిపిఎం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు గోవిందు, రామయ్య, రాజు, మల్లిఖార్జున మాట్లాడుతూ ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవటం అన్యాయమన్నారు.

పుట్టపర్తి క్రైమ్ :ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి విశిష్ట కృషిచేసిన ఆర్డీటీనికాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లంబాడి హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కార్యదర్శి రంగనాథ్ నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ కు ఆయన ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కలెక్టర్ చేతన్ కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల నాయకులు రమణ నాయక్, గోనే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పది ఫలితాల్లో మేటి 'జీవనజ్యోతి'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పదవ తరగతి ఫలితాల్లో ధర్మవరం జీవనజ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించి ఫలితాల్లో మేటి అని నిరూపించారు. ఈ ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 500 మార్కులకు పైగా 93 మంది విద్యార్థులు సాధించారు. 21 మంది విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధించారు. సి.హర్షిణి 592, డి.వర్షిత్ నాయక్ 591 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను జీవనజ్యోతి పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ సుజాత, కరస్పాండెంట్ సిస్టర్ రిన్సీలు అభినందించారు. క్రమశిక్షణ, ప్రణాళికతో కూడిన విద్యాభ్యాసాన్ని అందించడం వల్లనే తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ సుజాత తెలిపారు.



ప్రతిభా విద్యార్థులతో జీవనజ్యోతి పాఠశాల ప్రతినిధులు

పంచాయతీ కార్మికులతో సొంతపని

ప్రజాశక్తి - చిలమత్తూరు

మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులను సర్పంచి బంధువు తన సొంత ఇంటి పనులకు వాడుకోవడం విమర్శలు దారితీసింది. గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులు గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తూనే, సర్పంచి ఇంట్లో అన్ని పనులు చేయడం పరిపాటిగా మారింది. సోమవారం పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ లో ఇటుకలు లోడ్ చేసుకుని సర్పంచి ఇంటి వద్ద అన్‌లోడ్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియా వేదికగా వైరల్ అయ్యాయి. ప్రజా ప్రతినిధులు ఇలా వ్యవహరించడం పంచాయతీ పరిపాలనపై నమ్మకాన్ని దెబ్బతీస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సర్పంచి ఇంటిముందు ఇటుకలు దింపుతున్న కార్మికులు

డ్రిప్పు పైపులు చోరీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని మిట్టపల్లి పంచాయతీ మల్లేపల్లి గ్రామంలో డ్రిప్పు పైపులు చోరీ అయ్యాయి. ఈ మేరకు బాధిత రైతు పొదిలి సాంబశివారెడ్డి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఇనుగులూరు గ్రామ పొలం సంబంధించిన మూడు ఎకరాల పొలంలో డ్రిప్పు పైపులను వ్యవసాయ నీటి పారుదలకు ఉపయోగిస్తున్న డ్రిప్ పైపులను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు బాధితుడు వాపోయాడు. వీటి విలువ రూ. 3 లక్షలు అన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి జిల్లాలో ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నవోదయం 2.0లో భాగంగా సోమవారం ఎక్సైజ్ పోలీసులు బుక్కపట్నం మండలం మదిరేబైలు తండా పరిసర ప్రాంతాలలో దాడులు నిర్వహించారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బెల్లపు ఊట అక్రమ నిల్వలను గుర్తించారు. తండాలో సారాను తయారు చేస్తున్న నల్లమాడ మండలం సానేవారిపల్లికి చెందిన కృష్ణయ్య, కుమార్ పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. అక్కడ 250 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ నరసింహులు, హెడ్ కానిస్టేబుళ్లనాగభూషణం, సురేష్ బాబు, ప్రసాద్ కానిస్టేబుళ్ల నరసింహారెడ్డి, అల్లాబకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-హిందూపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హిందూపురం డిఎస్‌పి కెవి మహేష్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. హిందూపురం రూరల్ పరిధిలోని లేపాక్షి మండలం తిలక్ నగర్ కాలనీలో సిఐ జనార్ధన్, ఎస్ఐ, పోలీసులు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లతో పాటు రౌడీ షీటర్లు , ట్రబుల్ మాంగర్స్ , ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

మైనర్లను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

సాంకేతిక పరిజ్ఞానానికి తోడు పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి రెండు ప్రాణాలను కాపాడిన సంఘటన హిందూపురంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం మండలం జూమాకులపల్లికి చెందిన పదహారేళ్ల యువతి, పరిగి మండల బీచిగానిపల్లికి చెందిన 20 సంవత్సరాల యువకుడు ఇద్దరు ఎవరికి చెప్పకుండా ఇళ్ల నుండి బయటకు వచ్చేశారు. ఆయా ఆ కుటుంబ సభ్యులు తమకు తెలిసిన ప్రాంతాల్లో వెతికిన ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హిందూపురం డిఎస్‌పి కెవి మహేష్ హిందూపురం రూరల్ సీఐ ఆంజనేయులు, ఎస్ఐ ముని ప్రతాప్‌ను అప్రమత్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆ ఇరువురు సోమందేపల్లి మండలం వెలగమాకులపల్లి తండా గుట్టలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్ఐ మునిప్రతాప్, ఏఎస్ఐ జయరామిరెడ్డి, కానిస్టేబుల్ జహీర్ల సోమందేపల్లికి చేరుకుని అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న సోమందేపల్లి ఎస్ఐ రమేష్ బాబు వారి సిబ్బంది ఏఎస్ఐ మురళీమోహన్ లు తో కలిసి వెలగమాకులపల్లి తండా గుట్ట వద్దకు చేరుకొని గుట్టపైనున్న ఇద్దరు మైనర్లను తమ వెంట తీసుకువచ్చారు. వారిద్దరిని హిందూపురం రూరల్ స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయా కుటుంబాలకు వారిని అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రెండు ప్రాణాలు కాపాడిన సిఐ, ఎస్ఐ తదితర సిబ్బందిని డిఎస్‌పి కెవి మహేష్ అభినందించారు. తమ పిల్లల ప్రాణాలు కాపాడి అప్పగించడం పట్ల పోలీసులకు పిల్లల కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలకు నల్లచెరువు విద్యార్థి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని బాలేపల్లితండాకు చెందిన విద్యార్థి ఏకలవ్యట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికయ్యాడు.తండాకు చెందిన భూక్యా జ్యోతి, రామకృష్ణ నాయక్ కుమారుడు భూక్యా అక్షిత్‌కుమార్ నల్లచెరువులోని బ్రిలియంట్ స్కూల్‌లో చదువుతున్నాడు. అర్హత పరీక్షలో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయిలో 111 ర్యాంకు సాధించిన అక్షిత్ కుమార్ ఏకలవ్యట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు, విద్యార్థితల్లిదండ్రులు మాట్లాడుతూ బ్రిలియంట్ పాఠశాలలో క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన చేయడం వల్లనే ఈ ఘనత సాధించాడన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆర్ సి పి పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర, కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు గురి అవుతున్నారన్నారు. కాలనీలో సిసిరోడ్లు,డ్రయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. హిందూశ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించి కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

వికలాంగుడి సమస్యపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్ కు వచ్చిన వికలాంగుని సమస్యపై కలెక్టర్ టిఎస్ చేతన్ ఆరా తీశారు. సోమవారం ఒడిసి మండలానికి చెందిన ఇనగలూరు గ్రామ వికలాంగుడు కె. శంకర్ కలెక్టరేట్ కు తన సమస్య చెప్పుకోవడానికి వచ్చాడు. సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చినప్పటికీ కలెక్టర్‌కే తన సమస్యను నేరుగా చెప్పాలని కలెక్టరేట్ బయట వేచి ఉన్నాడు. కలెక్టర్ బయటకు వచ్చినప్పుడు అక్కడే వేచి ఉన్న శంకర్‌ను చూసి అతని దగ్గరకు వెళ్లిన కలెక్టర్ అతని సమస్య గురించి ఆరా తీశారు. ఇనగలూరు గ్రామ పొలంలో సర్వే నెంబరు 38 నందు 0.63 ఎకరాల పట్టా ఉందని ఆ భూమిని తానుసాగు చేస్తున్నానని పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయించాలని కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే కలెక్టర్ స్పందించి అక్కడే ఉన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను క్షేత్రస్థాయిలో ఆ భూమిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మొదటి రోజు సోమవారం రిలే నిరాహారదీక్ష ను డిపో సెక్రటరీ కె. మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు . ఈ శిబిరంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి. రమణ , జోనల్ వైస్ ప్రెసిడెంటు శేఖర్, డిపో సెక్రటరీ కె. మధుసూదన్, గ్యారేజ్ సెక్రటరీ హరికృష్ణ, శ్రీనివాసులు, మంజునాథ్, గోపాల్, అహమ్మద్ నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ అసోసియేషన్ జిల్లా రీజినల్ చైర్మన్ ముత్యాలప్ప పాల్గొని ప్రసంగించారు. గతంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, గేట్ మీట్ నిరసన చేపట్టినప్పటికీ యాజమాన్యం స్పందించలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి డిపో ముందు ఈ రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి గంగులయ్య, రీజనల్ ఉపాధ్యక్షులు కేశప్ప, బాబ్‌జాన్, రవితేజ, చంద్రాయుడు, శివశంకర్, నాగరత్నమ్మ, భవాని, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.